నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ మంగళవారం 3 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

## కలెక్టరేట్ ఎదుట వీఆర్‌ఏల ధర్నా

ఎదులాపురం, డిసెంబర్ 2 : వీఆర్‌ఏ వారసులకు నియామక ఉత్తర్వులు ఇవ్వాలని వీఆర్‌ఏ జేఏసీ అధ్యక్షుడు సంతోష్ కోరారు. సోమవారం వీఆర్‌ఏ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జీవోలపై ఉన్న స్టే ఎత్తివేయడం జరిగిందని జీవోను అమలు నియామక ఉత్తర్వులు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సల్మాన్, శ్రీనివాస్, రమేశ్, పొచ్చన్న, ప్రియ, మమత, అనసూయ, లక్ష్మి పాల్గొన్నారు.



కప్పర్ల శివారులో ఎడమ కాలువలో పూడిక తీస్తున్న రైతులు

## రైతులే కాలువ పూడిక తీసి..

### చివరి రైతుకు అందని సాగునీరు

తాంసి, డిసెంబర్ 2 : ప్రాజెక్టులతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో సాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. మత్తడి ప్రాజెక్టు నిండా పుష్కలంగా నీరు ఉన్నా ఎడమ కాలువలో పిచ్చి మొక్కలు పెరిగి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడం లేదు. మరోవైపు కుడి కాలువతో రైతులకు సాగునీరు అందించడం కలగానే మారింది. కప్పర్ల రైతులు వారి యాసంగి పంటను కాపాడుకోవడానికి ప్రధాన ఎడమ కాలువ నుంచి కప్పర్ల చెరువు వైపు వెళ్లే కాలువ పూడికతీత పనులు రైతులే స్వయంగా చేపట్టారు.అధికారులు చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

### సార్ల చుట్టూ తిరిగినం..



దహెగాం,డిసెంబర్ 2 : నా పేరుమీద కొంచవెల్లి గ్రామీణ బ్యాంక్‌లో రూ. 60 వేలు, నా భార్య పేరున రూ. 80 వేల పంట రుణం తీసుకున్నం. సర్కారుకు రుణ మాఫీ చేస్తదని ఆశతో ఎదురు చూసినం. యేటా బ్యాంక్ రుణాలు మంచిగ కడుతున్నం. మా ఊరిలో కొందరి రైతులకు మాత్రమే డబ్బులు పడ్డయి. మాకు ఎందుకు రాలేదని బ్యాంక్ సార్లను అడిగితే అగ్రికల్చర్ సార్లను అడుగమని చెప్పిన్రు. గా సార్ల చుట్టూ మస్తు సార్ల తిరిగినం. రానివాళ్ల లిస్టు పైకి పంపిస్తున్నం. వస్తదని చెప్పిన్రు. కాని ఇప్పటి వరకు రూపాయి కూడా రాలే.

-కూడే బక్కన్న, గిరివెల్లి

# రుణమాఫీ కాలే..



## మాఫీ చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ సర్కారు

- ఎంత మందికి మాఫీ అయ్యింది.. ఎందరికీ కాలేదు అనే దానిపై క్లారిటీ మిస్..
- సర్వే చేసిన వివరాలు ఆన్‌లైన్ చేసినా వాళ్లకు రుణమాఫీ అవ్వలేదు..
- మా దగ్గర లెక్కలు లేవంటున్న ప్రభుత్వ యంత్రాంగం



### నేను రైతును కాదా..?

తాంసి, డిసెంబర్ 2 : పంట వేద్దామని రూ.లక్షా 75 వేలు అప్పు తీసుకున్న. ఎన్నికలకు ముందు కాంగ్రెసోళ్లు రూ.2 లక్షల లోపు మాఫీ చేస్తమన్నరు. నాలుగో లిస్టులో కూడా నా పేరు రాలే. నేను రైతును కాదా.. పంట కోసం అప్పు తీసుకున్నోళ్లందరికీ మాఫీ చేయాలే. కేసీఆర్ సర్కారుల అందరికీ రుణం మాఫీ చేసిన్రు. వీళ్లు మాత్రం కొందరికే ఇచ్చి చేతులు దులుపుకున్నరు. గీ వయసులో ఆఫీసుల చుట్టూ తిరగడం ఇబ్బందిగా ఉంది. మా బాధలను అర్థం జేసుకొని అప్పు మాఫీ చేయాలె.

- కంది పొచ్చక్క, హస్నాపూర్

### నాలుగో విడతలో నా పేరు రాలే..

తాంసి, డిసెంబర్ 2 : హస్నాపూర్ శివారులో 8 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్న. మూడో విడత రుణమాఫీలో నా పేరు వస్తుందని ఆశపడ్డా. నాలుగో విడత వచ్చిన నా పేరే లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు రైతులందరికీ రుణమాఫీ చేస్తానని చెప్పిండు. ఇప్పుడు మాట తప్పిండు. రూ.లక్షా 75 వేలు బాకీ ఉన్న. ఇప్పటిదాకా ఒక్క రూపాయి రుణమాఫీ కాలేదు.

-కంది సుభాష్ రెడ్డి, హస్నాపూర్



మంచిర్యాల, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికలకు ముందు రూ.2 లక్షల లోపు రైతుల రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చాక మాట మార్చింది. వాయిదాలు వేస్తూ అధికారంలోకి వచ్చి ఏడాదైనా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయడంలో విఫలమైంది. రాష్ట్రంలోని రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ కోసం రూ.40 వేల కోట్లు అవుతాయని రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి ముందు ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక రూ.31 వేల కోట్లతో కేబినేట్ తీర్మానించింది. ఇక్కడే రూ.9 వేల కోట్లు తగ్గిందనుకుంటే.. రాష్ట్ర బడ్జెట్‌లో రుణమాఫీకి కేవలం రూ.26 వేల కోట్లు పెట్టారు. చివరకు నాలుగు విడుతల్లో కలిపి రూ.20,616 కోట్లు మాఫీ చేశామంటున్నారు. సీఎం చెప్పిన దానిలో సగానికి సగం రుణమాఫీ మొత్తం తగ్గింది. ఈ లెక్కన సగం మందికి కోత పెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్యాంకర్ల తప్పిదాలతో మాఫీ అంచనా రూ.11 వేల కోట్లు పెరిగితే, మరి బడ్జెట్ కేటాయింపుల్లో ఎందుకు ఎక్కువ చూపించారని రైతులు ప్రశ్నిస్తున్నారు. రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం తీసుకున్నోళ్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నాలుగో విడుత కింద మంచిర్యాల జిల్లా 8,195 మందికి రూ.78.59 కోట్లు, ఆదిలాబాద్ జిల్లాలో 6,600 మంది రైతులకు రూ.78 కోట్లు, నిర్మల్ జిల్లాలో 6,823 మంది రైతులకు రూ.69.67 కోట్లు, ఆసిఫాబాద్ జిల్లాలో .... రైతులకు ... కోట్లు విడుదల చేసినట్లు గణాంకాలు చెప్తున్నాయి.

### కేసీఆర్ సర్కారు చేసినప్పుడే బాగుండే..

తెలంగాణలో తొలిసారి కేసీఆర్ సర్కారు 35 లక్షల మంది రైతులకు రూ.లక్ష వరకు రూ.17 వేల కోట్ల రుణమాఫీ చేసింది. ఇప్పుడు 25.35 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు చేసినా కేవలం రూ.20 వేల కోట్లు అయ్యిందంటున్నారు. ఈ లెక్కన సగానికి సగం మందికి రుణమాఫీ కాకుండా ఎగ్గొట్టినట్లు స్పష్టం అవుతున్నది. రుణమాఫీ కానీ రైతుల్లో ఇప్పటికే కాంగ్రెస్ సర్కారుపై నైరాశ్యం నెలకున్నది. రుణమాఫీ కాలేదని బయటికి వచ్చి చెప్పుకోలేని దుస్థితిలో అన్నదాతలు ఉన్నారు. బ్యాంకులకు వెళ్లి స్టేట్‌మెంట్ తీస్తేకాని రుణమాఫీ వివరాలు తెలిసేలా లేవు. ఈ నేపథ్యంలో మరో ఒకటి, రెండు రోజుల్లో పూర్తిస్థాయి వివరాలు బయటికి రానున్నాయి. అన్ని అర్హతలు ఉండి రుణమాఫీ కాని కొందరు రైతులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. మాకెందుకు అన్యాయం చేయారంటూ నిలదీస్తున్నారు.

### సర్వే చేసినా ప్రయోజనం శూన్యం

మూడు విడుతల్లో రేషన్‌కార్డు లేనోళ్లు, పేర్లలో అక్షర దోషాలు ఉన్నోళ్లకు రుణమాఫీ కాలేదు. ఈ మేరకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అధికారులు సర్వే చేశారు. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అయినప్పటికీ వారిలో చాలా మందికి రుణమాఫీ కాలేదు. రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న రైతులు బ్యాంక్‌లకు వెళ్లి ఎక్కువ మొత్తాన్ని చెల్లించాలని, అనంతరం రూ.2 లక్షల మాఫీ అవుతుందంటూ గతంలో చెప్పారు. రైతులు కూడా బ్యాంకులకు వెళ్లి బారులుదీరి రుణాలు చెల్లించారు. రుణం చెల్లించిన పత్రాలను తీసుకుని రైతు వేదికల్లో అధికారులకు సమర్పించారు. ఇక నాలుగో విడుతలో మాకు రుణమాఫీ అవుతుందనుకుని సంబురపడ్డారు. కానీ.. అసలు వారెవరికీ మాఫీ జరగలేదని తెలిసింది. రేషన్‌కార్డు లేనోళ్లు, పేర్లలో అక్షర దోషాలు ఉండి రానోళ్లు.. రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్నోళ్లు చాలా మంది రూ.2 లక్షలు మాఫీ కాక లబోదిబో మంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, పింఛన్‌దారులకు, ఐటీ రిటర్న్స్ కట్టేవాళ్లకు, రేషన్‌కార్డ్ లేని వారికి.. ఇలా అనేక రకాల కొర్రీలు పెట్టి 100 మందిలో 60 మందికే మాఫీ చేసి 40 మందికి ఎగ్గొట్టింది. ఎన్నికల్లో ఓట్లేసి గెలిపించిన రైతులను కాంగ్రెస్ సర్కారు మోసం చేసింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 2.50 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినట్లు అధికారులు చెప్తున్నా ఎందరికి అయ్యింది. ఎందరికి కాలేదంటే మాత్రం వివరాలు లేవని చెప్తున్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితోనే అవస్థలు

ఇచ్చోడ, డిసెంబర్ 2 : ఇచ్చోడలోని మహాత్మా జ్యోతిబా పూలే హాస్టల్‌ను బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి పర్వేజ్, జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ నాయకులతో కలిసి సోమవారం సందర్శించారు. వసతి గృహాల్లోకి అనుమతి లేదంటూ వారిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితోనే ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం అవుతున్నాయని మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వాఘ్మరే ప్రశాంత్, రమేశ్, యువజన నాయకులు మహేశ్ పాండురంగ్, నాయకులు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు

## పెండింగ్ డబ్బులు చెల్లించాలి

### ఆ తరువాతే కొత్త సర్వేలు చేయించాలి

ఎదులాపురం, డిసెంబర్ 2 : గతంలో నిర్వహించిన లెప్రసీ, పల్స్‌పోలియోకు సంబంధించిన పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలని సీఐటీయూ కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న సర్వేలో బిల్లులను విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు శోభ, కార్యదర్శి సుజాత, ఆషా, పుష్ప, లక్ష్మి, సంగీత, ప్రేమలత, పద్మ, సురేఖ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

## 50 మంది విద్యార్థులు.. ఒకే ఉపాధ్యాయుడు

సోన్, డిసెంబర్ 2 : సోన్ మండలంలోని గంజాల్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 50 మంది వి ద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నా రు. ఇక్కడ ఒకటో తరగతి నుంచి ఐదు తరగతులుండగా.. ఒకే ఒక్క ఉపాధ్యాయుడు బోధిస్తున్నాడు. ఒక్క తరగతి గదిలో ఒకటి, రెండు తరగతి విద్యార్థులను కూర్చోబెట్టగా, 3,4,5 తరగతుల విద్యార్థులు వేరే గదిలో కూర్చోబెట్టి చెబుతున్నాడు. ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులకు ఒక్క ఉపాధ్యాయురాలు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినట్లు, ఇంకో ఉపాధ్యాయుడు నార్మల్ లీవ్‌లో ఉన్నట్లు సమాచారం.



మూడు తరగతుల విద్యార్థులకు ఒకే తరగతి గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

# ‘ఫెంగల్’ పరేషాన్

- ధాన్యంపై తుఫాన్ ప్రభావం
- పంటలను వెంటాడుతున్న మబ్బులు
- కల్లాల్లోనే పేరుకుపోయిన వడ్ల కుప్పలు
- మందకొడిగా సాగుతున్న కొనుగోళ్లు
- వర్షం భయంతోపాటు బోనస్‌పై భరోసా లేక దళారులకే విక్రయాలు
- క్వింటాలుకు రూ.400 వరకు నష్టపోతున్న రైతులు

నిర్మల్, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ) : నిన్నటి వరకు ధాన్యం రైతును సర్కారు ఓ వైపు, దళారులు మరో వైపు తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తుండగా.. ప్రస్తుతం ప్రకృతి రూపంలో ఫెంగల్ తుఫాన్ ఆందోళనకు గురి చేస్తున్నది. ఇప్పటికే ధాన్యాన్ని అమ్ముకునేందుకు ఆపసోపాలు పడుతున్న అన్నదాతకు గోరు చుట్టపై రోకటి పోటులాగా ఈ తుఫాన్ ప్రభావం వెంటాడుతున్నది. ఫెంగల్ తుఫాన్ తీవ్రత విస్తరిస్తున్న కారణంగా ఆకాశమంతా మబ్బులు పట్టడమే కాకుండా, వర్షాలు కురవవచ్చని వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలు రైతులను ఆవేదనకు గురి చేస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ప్రభుత్వ కొనుగోళ్ల ప్రక్రియ అస్తవ్యస్తంగా మారడంతో రైతుల ధాన్యమంతా కల్లాలతోపాటు, కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో తేమ, తప్ప, తాలుతోపాటు గన్నీ బ్యాగుల కొరత కారణంగా లక్ష్యం మేరకు కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగడం లేదన్న విమర్శలున్నాయి. ఒకవైపు మందకొడిగా సాగుతున్న కొనుగోళ్లతోపాటు, ఏ సమయంలోనైనా వర్షం కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ చెబుతుండడంతో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని ఎక్కడ నిలువ చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. దాదాపు 45 రోజుల క్రితమే జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించినప్పటికీ బోనస్‌పై స్పష్టత లేకపోవడం, మిల్లర్ల వ్యవహారం కారణంగా ఇప్పటి వరకు కనీస స్థాయిలో కూడా లక్ష్యాన్ని చేరుకోలేకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది.

### లక్ష్యానికి ఆమడ దూరం

1.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇప్పటివరకు 61,929 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడం గమనార్హం. ఇందులో నుంచి దొడ్డురకం 49,620 ఎంటీఎస్ కాగా, సన్న రకం ధాన్యాన్ని కేవలం 12,309 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ఇలా మొత్తం 40 శాతం లక్ష్యం కూడా ఇప్పటివరకు పూర్తి కాలేదంటే కొనుగోలు ప్రక్రియ ఎంత మందకొడిగా సాగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. కాగా.. వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్న కారణంగా రైతులు సర్కారు కొనుగోళ్లపై ఆశలు వదులుకుని ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తూ క్వింటాలుకు రూ.400వరకు నష్టపోతున్నారు. అలాగే ప్రభుత్వం బోనస్ డబ్బులను మద్దతు ధరతో పాటు చెల్లించకపోతుండటం కూడా రైతుల్లో అనుమానాలకు ఆస్కారమిస్తున్నది. ప్రభుత్వ కొనుగోళ్ల ప్రకారం సన్నరకం ధాన్యానికి గాను రైతులకు క్వింటాలుకు రూ.2300 మద్దతు ధరతోపాటు బోనస్ రూ.500 కలిపి రూ.2800లు దక్కాల్సి ఉన్నది. అయినప్పటికీ ప్రస్తుత గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో గత్యంతరం లేక రైతులు ప్రైవేటు వ్యాపారులకు కేవలం రూ.2350లకే క్వింటాలు ధాన్యాన్ని అమ్ముకుంటూ నష్టపోతున్నారు. అంతేకాకుండా ప్రైవేటు వ్యాపారులు డబ్బులు చెల్లించేందుకు 2శాతం కమీషన్ కూడా దండుకుంటున్నారు. ఇక హమాలీ తదితర ఖర్చుల భారాన్ని రైతులపైనే మోపుతుండడంతో అన్నదాతలు అన్ని విధాలుగా నష్టపోయే పరిస్థితి నెలకున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దొడ్డు వడ్లతోపాటు సన్నాల కొనుగోలు ప్రక్రియను వేగం చేసి, సకాలంలో సన్నాలకు బోనస్ అందజేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. లేకుంటే అకాల వర్షాలకు రైతులు నష్టపోయే అవకాశం ఉందని వాపోతున్నారు.



తుఫాన్ భయంతో తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్న రైతులు



నిర్మల్ శివారులోని సిద్దాపూర్‌లో సర్కారు కొనుగోళ్లు లేక కల్లాల్లోనే పేరుకుపోయిన ధాన్యపు రాశులు

### సొసైటోళ్లు కొనమంటున్నరు..



నాకు సిద్దాపూర్ శివారులో ఐదెకరాల పొలం ఉన్నది. సన్నరకం వడ్లకు బోనస్ ఇస్తరంటే ఈసారి మొత్తం సన్నాలే ఏసిన. పంట చేతికొచ్చి నెల రోజులైతున్నది. కల్లాలనే కుప్పలు పోసి పెట్టిన. 10 రోజుల కింద ఓ రైస్‌మిల్ ఆయనకు రూ.2400ల ధరతో 30 క్వింటాళ్లు అమ్మిన. ఇంకా 60 క్వింటాళ్ల దాక వడ్లు ఉన్నయ్. ప్రభుత్వం బోనస్ ఇచ్చి కొంటదేమోనని ఎదురు చూస్తున్న. సొసైటోళ్లు అచ్చి చూసిన్రు. ఎప్పుడు కొంటరని అడిగితే.. సన్న వడ్లు కొనమంటున్నరు. చేసేదేమి లేక మళ్లీ ప్రైవేటోళ్లకే అమ్మెతందుకు చూస్తున్నం. మా ఊరి రైతులంతా సన్న వడ్లు రూ.2,350 ప్రైవేటోళ్లకు అమ్ముతున్నరు. తుఫాన్ భయంకు ఎంతకైతే అంతకు అందరు అమ్మేస్తున్నరు.

- కొట్టాల అశోక్, రైతు, సిద్దాపూర్.

### బోనస్ ఉత్తమాటనే...



కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లకు బోనస్ ఇస్తామం టే నమ్మి నాకున్న తొమ్మిదెకరాల్లో సన్నాలు సా గు చేసిన. కానీ.. కొనేం దుకు ఎవరూ రావడం లేదు. మా సిద్దాపూర్.. మంజులాపూర్ సొసైటీ కిందికి వస్తుంది. గత కేసీఆర్ ప్రభుత్వంలో సిద్దాపూర్‌కు సబ్‌సెంటర్ ఇచ్చి ఇక్కడే ప్రభుత్వం కొను గోళ్లు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం రైతులను ఏమా త్రం పట్టించుకోవడం లేదు. మంజులాపూర్ కొను గోలు కేంద్రం నిర్వాహకులు మా ఊరికి వచ్చి దొ డ్డు వడ్లు మాత్రమే కొన్నారు. సన్నాలను కొనడం లేదు. సొసైటీ వాళ్లను అడిగితే మేం కొనమంటున్నారు. తక్కువ ధరకే ప్రైవేటుకు అమ్ముకున్నం. ప్రభుత్వం బోనస్ ఇస్తామంటేనే సన్న వడ్లు వేసినం. రైతుబంధు లేదు, చాలా మందికి ఇంకా రు ణమాఫీ కాలేదు. బోనస్ ఇవ్వాల్సి వస్తుందని ప్ర భుత్వం సన్న వడ్లను కొనడం లేదు. కాంగ్రెస్ వచ్చినప్పటి నుండి రైతులకు కష్టాలు తప్పడం లేదు.

- జీ.రవీందర్, రైతు, సిద్దాపూర్.

## సమస్యలను పరిష్కరించరూ..

- ప్రజావాణికి తరలివచ్చిన జనం
- 70 దరఖాస్తుల అందజేత

ఆదిలాబాద్, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో తమ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు 70 మంది దరఖాస్తులు అందజేశారు. రుణమాఫీ, భూముల సమస్యలు, పంట అమ్మకాల్లో ఇబ్బందులు, రహదారుల సమస్యలు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం బెదిరింపుల వంటి వాటిపై అర్జీలను కలెక్టర్‌కు అందజేశారు. దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అధికారులు తమ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

## అంతర పంటగా గంజాయి సాగు

- ఆరుగురు నిందితుల అరెస్టు
- రూ.70 లక్షల విలువ గల గంజాయి స్వాధీనం

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 2 : మంగల్ సింగ్ తండాలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్న ముఠా సభ్యులను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలను వెల్లడించారు. మంగల్‌సింగ్ తండాకు చెందిన టకాడ ఇందల్, కసావత్ సజన్‌లాల్, గోతి రవీందర్, కచ్‌కద్ సంతోష్, బమానే సురేందర్, పేలియ ప్రతాప్ సింగ్‌లు తమ చేలలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్నారు. పంట చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేసి గుట్టు చప్పుడు కాకుండా సాగు చేస్తున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి గంజాయి పంటపై దాడి చేశారు. దాదాపు గంజాయి మొక్కలు ఆరు ఫీట్ల వరకు పెరిగాయని వీటిని స్వాధీనం చేసుకుని ఖానాపూర్ సర్కిల్‌కు అప్పగించామని తెలిపారు. వీటి విలువ రూ.70 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ ప్రభాకర్, ఖానాపూర్ సీఐ సైదారావు, కడెం ఎస్సై కృష్ణసాగర్, ఆర్ఎస్సై రవి, డాగ్ స్క్వాడ్ సిబ్బంది సాయి, సీసీఎస్ సిబ్బంది తిరుపతి, గణేశ్, సతీశ్, కానిస్టేబుల్ కైలాశ్, భీమారావు, షారూఖ్ ఉన్నారు.




వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకి షర్మిల